# మనోరంజితం - 10

ఆ ఫిల్మ్‌కూ పేరు రావటంతో ఉత్సాహంగా వెంటనే ఇంకొక నాటికకూ శ్రీకారం చుట్టాడు. ఈసారి మహా రాష్ట్రనుండి వచ్చిన ఒక యువకుడు చెప్పిన ఊరి కథనం ఆధారమైంది...! అతనిని ఆ సెంటర్ నిర్వాహకులే... అతని అనుభవాలను వివరించమని ఆహ్వానించారు. అతని ప్రసంగం ఈ విధంగా సాగింది.

''మాదొక కుగ్రామం. మా ఊరి యువకులందరం కలిసి మేం సాధించిన ప్రగతిని మీకు వివరించమని ఆహ్వానం అందటం చాలా ఆనందం కలిగించింది. మా పూర్వీకులు తెలుగువాళ్ళే. జీవనోపాధికోసం అక్కడకు వెళ్ళి స్థిరపడినవాళ్ళవటం వలన తెలుగు మాట్లాడటం మా కుటుంబాలకీ అలవడిరది. అందువలనే నేను మీ ముందు నిలబడగలిగాను!

మునుపు మా ఊరు ఎలా ఉండేదో మీకు చెబుతాను. మా ఊళ్ళోని జనాభాలో నూటికి డెబ్బైమంది మందుబాబులే. మా ఊరికి కనీసావసరాల్లాంటి డ్రైనేజ్ సిస్టమ్, మంచి రోడ్లు, నీటి వసతి ఇలాంటివేవీ లేకపోయినా మందు దుకాణాలకు మాత్రం లోటు లేకుండా విరివిగా ఉండేవి. పనీ పాటలు మానేసి వేళాపాళా లేకుండా తాగి తూగే వాళ్ళు ఎక్కువయ్యారు. చేతికి ఎంత అందితే, అంతా తాగటానికి ఖర్చు చేయటం... ఏమీ దొరకనివ్వకపోతే ఇంట్లో వాళ్ళ మీద వీరంగమే.

ఇలాటి దుస్థితిలో ఉన్న మా ఊరును ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాళ్ళు దత్తత తీసుకోవటం జరిగింది! అదే మా ఊరు బాగుపడటానికి కారణం కూడా అయింది!

మందు అలవాటును ముందుగా మాన్పించి... కష్టపడి సంపాదించే తత్వానికి అలవాటు చేయాలని వాళ్ళు సంకల్పించి... ఇంటింటికీ తిరిగి మందు అలవాటుతో వచ్చిన అనర్థాలు గురించి ప్రచారం చేశారు, కుటుంబ ప్రయోజనాల గురించి ఆలోచనా కలిగించారు. ఆ ప్రచారం కొంత ఫలితం ఇచ్చింది. మా యువకులలో ఉత్తేజం వచ్చింది. బృందాలుగా ఏర్పడి ప్రచార సభలు పెట్టాం.... ర్యాలీలు జరిపాం.

వీధులన్నీ తిరిగి మందు దుకాణాలను ముందుగా మూయించాం. చాలామంది సహకరించటంతో సాధ్యమైంది. ఎవరి ఇళ్ళల్లో మందు బాటిల్స్ ఉన్నా తెచ్చి ఒకచోటవేసి తగులబెట్టాం. మందు సీసాలతో పాటూ చుట్ట, బీడీ, సిగరెట్ ల్లాంటివీ లేకుండా చేయగలిగాం...!

పనులు చేసే వాళ్ళు తగ్గి... తాగుడుకు అలవాటు పడిన వాళ్ళు పెరగటంతో ఊరులో అభివృద్ధి లేకుండా పోయిందన్న ప్రచారాన్ని నమ్మి... పెద్దలు, పిన్నలు అంతా సహకరించారు. స్త్రీలు కూడా మందు అలవాటును ఊరునుండి పూర్తిగా తరిమికొట్టటానికి ఉత్సాహంగా ముందుకు ఉరికారు! ఫలితం కనుపించింది. ఊరినుండి మందు దుకాణాలన్నీ

పరారవటంతో... మార్పు చాలా వేగంగా వచ్చింది! 'మందు ముట్టను... పొగ తాగను...' అంటూ ఊరివాళ్ళు ప్రమాణాలు చేయటమే కాదు, దానికి కట్టుబడి ఉండగలిగారు!

కుటుంబాల క్షేమంకోసం, ఊరు అభివృద్ధికోసం... అందరూ నిగ్రహం పాటించడంతో... మా ఊళ్ళో మందు వాసన అన్నదే లేకుండా పోయింది! శుచీ, శుభ్రతా పెరిగాయి! మంచి రోడ్లు, ఇంటింటా మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలూ ఏర్పడ్డాయి. దీంతో ఊరుకి రెండు అవార్డులు వచ్చాయి. పేపర్లో వార్త రావటంతో ప్రచారమూ వచ్చింది. అందువలనే నేనీరోజు మీ ముందు నిలబడి ప్రేరణ కలిగించాలనే స్ఫూర్తితో మాట్లాడే అవకాశమూ దక్కింది...!'' అంటూ అతను ముగించాడు.

సరిగ్గా అదే కథనాన్ని మంచిర్యాల జిల్లా తాటిగూడెం గిరిజన గ్రామం నుండి వచ్చిన ఒక యువకుడూ వారి వూరికథ వినిపించాడు.

" సరిగ్గా మా ఊరుదీ ఇదే కథండీ. మా ఊరి గిరిజనులందరికీ వ్యవసాయ భూములుండేవి ఒకప్పుడు. అయితే సాగు మాని తాగుడుకు బానిసలై అప్పులపాలై కూలీలుగా మారారు. పేదరికం, నిరక్షరాస్యతతో అభివృద్ధి అన్నదే లేకుండా పోయింది. బడికి వెళ్ళే పిల్లలు తక్కువ... తాగి తూగే పెద్దలు ఎక్కువ. ఆకలి బాధలు, అపరిశుభ్రతకూ మారుపేరుగా నిలిచిన మా ఊరు దుస్థితిని చూసిన రాము అనే యువకుడు మన ఊరును మనమే బాగు చేసుకుందామనే ఉత్తేజాన్ని రగిలించాడు.

తాగుడు నుండి ఊరుకు విముక్తి కలిగించాలని ఎంత ప్రచారం చేసినా ఎవరూ వినలేదు. అయినా నిరాశపడకుండా, ఊరి సమస్యలపై దృష్టి పెట్టారు. ప్రతీ ఇంటికీ వెళ్ళి ఓపికగా వారి సమస్యల్ని తెలుసుకుని... గ్రామీణ బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించి... రుణాలు ఇప్పించారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల ఫించనులూ వచ్చే ఏర్పాటు చేశారు. ఇలా ఏకలవ్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులుగా మారి, ఊరు అభివృద్ధికి మా ఊరి యువకులు బాట వేశారు. దాంతో ఊరి జనాలు తమంతట తాముగా తాగుడుకు స్వస్తి చెప్పారు. ప్రతీ ఇంటిలోనూ ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు ఏర్పాటు అయ్యాయి. ముళ్ళ పొదల్ని తొలగించి మొక్కల్ని నాటటం జరగటంతో .... పచ్చదనం పెరిగింది.

ప్రతీ ఆదివారం... వీధుల్నీ, మురికి కాలువల్నీ మహిళలు, యువకులూ శుభ్రం చేయటమూ జరిగింది. ప్రతి కుటుబం కొంత కొంత వేసుకుని ఆ డబ్బుతో... ఒక నిధిని ఏర్పాటు చేసి... అత్యవసరాలకీ, వైద్యానికీ ఉపయోగించటం జరుగుతోంది.

రెండేళ్ళ కృషితో... మా ఊరును చుట్టుపక్కల గ్రామలకూ ఆదర్శంగా తీర్చిదిద్దగలిగాం! సంకల్ప బలం ఉంటే సాధించలేనిదంటూ ఉండదని నిరూపించగలిగాం! మా ఊళ్ళో తాగుడు, గుడుంబాలాంటివన్నీ నిషేధం... ఎవరైనా తాగివస్తే జరిమానా ఉంటుంది!

అతను చెప్పటం ముగించగానే ఇద్దరు ముగ్గురు లేచినిలబడి... అరకొరగా మాత్రమే సాగిస్తున్న మందు వ్యసనాన్ని పూర్తిగా మానేయలనుకుంటున్నట్లుగా ప్రమాణం కూడా చేశారు!

ప్రసంగ పాఠాల స్ఫూర్తి అలా ప్రభావం చూపించిందని... అందరూ వాళ్ళని చప్పట్లతో అభినందించారు!

వాళ్ళిద్దరి గ్రామాల స్ఫూర్తితో అభిరామ్ కూడా 'మా ఊరి కథ' అంటూ ఒక వీడియో తీశాడు. దానికీ బాగా పేరొచ్చింది.

ఆ తరువాత... 'తిమ్మాపురం' అనే ఊరు గురించి తెలిసి... గేయ నాటికలా రూపొందించాడు. తండ్రీ కొడుకుల సంభాషణ మధ్యలో ఒకరిద్దరు... వాళ్ళ సంభాషణా మాటలతో కాకుండా, పాటలా రచించాడు అభిరామ్.

'తిమ్మాపురం... పోదం వస్తవా ఓరయ్యో... బంగారయ్యా...' అని కొడుకు తండ్రితో అంటే... 'ఎందుకురా ఆ వూరు వెళ్ళటం...' అదే విధానంలో తండ్రి తిరిగి ప్రశ్నిస్తాడు.

ఆ ఊళ్ళో... మంచి నీళ్ళకు బదులు... అందరూ బ్రాందీ, బీర్ లే తాగుతారనీ, చలివేంద్రంలో పెట్టినట్లుగా ప్రతీవీధిలో బిందెలతో మద్యాన్ని పెడుతూంటారనీ, కుళాయిల్లో కూడా అవే వస్తాయినీ, ఖర్చు లేకుండా ఎవరైనా ఎంతైనా తాగవచ్చని కొడుకు రాగంతీస్తూ పాటరూపంలో సమాధానం ఇస్తాడు... అతనికి తండ్రికి ఉన్న అలవాటును తెలిసే అలా చెబుతాడన్నమాట!

నిజమా... అంటూ ఎగిరి గంతేసిన తండ్రి వెంటనే ''పోదాం పదా...'' అంటూ తొందర బెడతాడు. అప్పుడు ఆ ఊరివాళ్ళు ఒకరిద్దరు ఆ తిమ్మాపురానికి అతని కొడుకు ఎందుకు తీసుకు వెళ్ళాలనుకుంటున్నాడో... వివరించి మందలిస్తారు.

ఇంతకీ ఆ వూళ్ళో పూర్తి మద్యనిషేధం అమల్లో ఉందన్నమాట! ఊరివాళ్ళందరూ కలిసి...

వాళ్ళు కూడా ఎవరైనా ఆ రూలును అతిక్రమిస్తే... జరిమానా కట్టాల్సిందేనని నియమం పెట్టుకున్నారు. ఈ విషయం తెలిసి... తండ్రిని తిమ్మాపురం తీసుకెళ్తే... అక్కడున్న కట్టుబాటుకు కట్టుబడి... మందు అలవాటును మానేస్తాడేమోనని ఆశపడిన కొడుకు ` తండ్రిని అక్కడ... మందు ఉచితమంటూ ఆశపెట్టాలనుకోవటం... ఆ గేయరూపకం ఇతివృత్తం...!

ఇదీ బాగా ప్రాచుర్యం పొందింది.

రచన, దర్శకత్వం అన్నీ అభిరామ్ చేస్తున్నా... తన అసలు పేరుతో కాకుండా 'రంజిత్' అనే పేరుతోనే వీడియోలన్నిటీన అభిరామ్ విడుదల చేశాడు.

రంజిత్ పేరే ఆ విధంగా ఆంధ్ర రాష్ట్రంలో మారుమ్రోగిపోతోంది. కొన్ని పాఠశాలలు కూడా తమ విద్యార్థులకు ప్రదర్శించటానికి గానూ ఆ వీడియోలను కొనుగోలు చేశారు. విద్యార్థిదశలోనే కొంతమంది మందు అలవాటుకు లోను

అవుతున్నారనే విషయాన్ని గుర్తించిన కొన్ని స్కూలు యాజమాన్యాలు... ఆ అలవాటు వల్ల కలిగే అనర్థాలను సమర్థవంతంగా  వివరించే ఆ వీడియోలు ఉపయోగపడతాయనే అభిప్రాయానికి వచ్చాయి.

రోగం వచ్చాక వైద్యం కంటే... రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవటమే మేలని అంటారు కదా... ఆ విధంగా వ్యసనాలకి అలవాటు పడకముందే, వాటివల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు మనసుకు పట్టేట్లు బోధించటానికి ఈ షార్ట్ ఫిల్మ్ వీడియోలు పనికివస్తాయనే ఆలోచన పెరిగింది! దాంతో గంజాయి, డ్రగ్స్, డ్రింకు లాంటి వ్యసనాలను వ్యతిరేకిస్తూ యదార్థ సంఘటనల ఆధారంగా అభిరామ్ చిత్రీకరిస్తున్న వీడియోలకు విశేష ప్రజాదరణ పెరిగింది!

'రంజిత్' అనే పేరుకి ప్రఖ్యాతి వచ్చిందిగానీ అభిరామ్ మాత్రం సాదా సీదా వ్యక్తిలా తెరవెనుకనే ఉండిపోయాడు. అభిరామే, రంజిత్ అనే విషయం అక్కడున్న వాళ్ళల్లో కొద్దిమందికే తెలుసు.

ఆ రోజు...

అభిరామ్ తన గదిలో కూర్చుని ఏదో రాసుకుంటున్నపుడు... ఆ సెంటర్లో పనిచేసే శకుంతల అక్కడికి వచ్చి... తన చేతిలోవున్న పాలగ్లాసుని టేబుల్ పై ఒక మూల పెట్టింది. ఆమె అక్కడ ఇదీ అదీ అని లేకుండా అన్ని పనులలోనూ పాలు పంచుకుంటుంది. ప్రతీరోజూ తన పనులు అన్నీ అయ్యాక తన హాస్టల్ గదికి వెళ్ళేముందు, అభిరామ్ గదికి ఓ గ్లాసు పాలు తెచ్చి... అతనికివ్వటం ఆమెకు రివాజుగా మారింది.

ఆ గ్లాసు అక్కడ పెట్టగానే... అభిరామ్ ఆమె వైపు చురుగ్గా చూసి ''పాలు... ఇక్కడ ఈ టైముకి అందరికీ ఇస్తుంటారు కాబోలనుకున్నా. కానీ నిన్న నాయక్ చెప్పారు.... మీ శాలరీ నుండి ప్రత్యేకంగా వీటికోసం డబ్బు కడుతున్నారటగా.. ఇలా నాకు మాత్రం... అదీ మీ స్వంత ఖర్చుతో ఎందుకూ...?'' అడిగాడు.

శకుంతల నిట్టూర్చి... ఏం సమాధానం చెప్పాలా అన్నట్లుగా ఓ క్షణం అటూ ఇటూ చూస్తూండేసరికి... అభిరామ్ తన టేబుల్‌కి ఎదురుగా వున్న మరో కుర్చీ వైపు చేయి చూపించాడు... కూర్చోమన్నట్లుగా.

ఆ మాత్రానికే చాలా సంతోషం అన్నట్లుగా కూర్చున్న శకుంతల అతనివైపు తేరిపార చూస్తూ ''మీరు... ఇక్కడకు ట్రీట్‌మెంట్ కోసం వచ్చినా... అందరి మేలుకోరి... ఇలా వీడియోల కోసం రచనలు చేస్తూ... వాటిని డైరెక్టు చేస్తూ... కష్టపడుతున్నపుడు.. ఈ మాత్రం... నేను మీ కోసం చేయటం... నాకు కర్తవ్యంలా అనిపించింది!'' అంది మెల్లగా.

''నేను... కష్టపడటం లేదు... ఇది నాకు ఇష్టమైన వ్యాపకం...!'' అన్నాడు అభిరామ్ తలవంచుకుని రాయటం మళ్ళీ మొదలు పెడుతూ.

''నాక్కూడా... మీకోసం ఏమైనా చేయగలగటం ఇష్టమని ఎందుకు తెలుసుకోరూ...?''

‘‘నామాట మీద... నేను తీస్తున్న వీడియోల్లో... నటిస్తూనే ఉన్నావుగా, ఉచితంగా. నాకంటే చాలా చిన్నదానివి కాబట్టి... మీరు అనటం బావుండదని... నువ్వు అంటున్నా. ఫరవాలేదుగా...’’ అంటూ నిట్టూర్చి... ‘‘కొంచెం ఆదాయం రావటం మొదలయ్యాక, ముందుగా నీకే ఎక్కువ మొత్తం వచ్చేఏర్పాటు చేస్తా...!’’ అన్నాడు అభిరామ్ మళ్ళీ.

‘‘నేనేమీ పారితోషికం గురించి ఆలోచించటం లేదు. పైగా నాకూ ఇష్టమైన అభిరుచి కూడా నటనకు అవకాశం ఉన్న పాత్రలను... మీరు నాకే ఇవ్వటం... నాకూ చాలా ఆనందం! మీరు నన్ను.... కేవలం చిన్నదాన్ని అనే కాకుండా, చనువుగా ‘కుంతలా’ అని పిలవమని మిమ్మల్ని అడిగాను. గుర్తుందా... అసలు... మా అమ్మ నాకీ పాత పేరు పెట్టినందుకే చాలా కోపంగా ఉంటుంది. పోనీ పిలుపులోనైనా కొంత ఆధునికంగా మార్చవచ్చుగా అంటే... వినిపించుకోదు... శకూ... అంటుంది...! కుంతలా అని పిలవమని మీకు చెప్పినా లాభం లేకపోయింది...! నా ముచ్చట ఇలా ముక్కలైంది...!’’ అంది కొంచెం అలకగా మొహం పెట్టి.

అభిరామ్ ఆమె వైపు చిరునవ్వుతో సరదాగా చూస్తుంటే.. మళ్ళీ శకుంతలే అంది ‘‘సరే, ఈ గొడవకేంగానీ, ఇపుడు మీరు రాస్తున్నదాని గురించి చెప్పండి...’’ అంది.

అభిరామ్ అలాగే చిరునవ్వుతో చూస్తూ చెప్పాడు.

‘‘నేనెపుడూ... అంటే... ఇప్పటికి... ఏది రాసినా, యదార్థ సంఘటనలనుండే ఇతివృత్తం తీసుకుంటున్నానని తెలుసుగా, ఇపుడూ అంతే. ఒకటి... ఒక ఉపాధ్యాయురాలుకి ఒక చిన్న అమ్మాయి చెప్పిన సంఘటన గురించీ, తద్వారా ఆమెకు ఎలాంటి ఆలోచన వచ్చిందీ, ఎలా ఆమె ఆచరించిందీ అన్నది వార్తగా వచ్చింది. దాని ఆధారంగా ఒకటి రాస్తున్నాను...!’’

‘‘కొంచెం వివరంగా చెప్పండీ... ఇందులో నాకూ ఏదైనా పాత్ర ఉన్నదా అనేది ముందుగానే నాకూ తెలుస్తుంది...!’’ అంది శకుంతల ఉత్సాహంగా.

‘‘ఒక చిన్న అమ్మాయి రోడ్డు పక్కన నిలబడి... బైక్ మీద వెళ్తున్న భార్యాభర్తలను చూసి చెయ్యి ఎత్తి... ఆగమని కోరింది. వాళ్ళు ఆగగానే దగ్గరికి వెళ్ళి ‘అంకుల్.... ప్లీజ్... నన్ను ఊళ్ళో శివాలయం దగ్గరే మా ఇల్లు... నన్ను అక్కడ దించరా...’ అనడిగితే... ‘ ఒక్కదానివీ ఎందుకు వచ్చినట్లు...?’ అని పెద్దాయన ఆరా తీస్తాడు. దానికా అమ్మాయి చెప్పిన సమాధానం ఏమిటో తెలుసా...? వాళ్ళ నాన్న తనని తీసుకువచ్చిన సంగతి మర్చిపోయి.... బాగా తాగేసి, ఒక్కడూ వెళ్ళిపోవటం జరిగిందని వివరిస్తే... ‘మనకెందుకు వచ్చిన గొడవ, పదండి పోదాం...’ అని వెనక కూర్చున్న వాళ్ళావిడ అభ్యంతరం చెప్పినా లెక్కచేయకుండా ‘పాపం చిన్నపిల్ల... ఒంటరిగా వదిలి ఎలా వెళ్లగలం...?’ అంటూ ఆయన బండిమీద ఆ పాపనూ ఎక్కించుకుని, జాగ్రత్తగా పాపను దించి వెళ్ళిపోవటం జరిగింది. ఇదంతా టీచరుకు ఆ మరునాడు ఆ పాప చెబుతుంది. అంతకు ముందు ఇద్దరు ముగ్గురు వెనక సీటు ఖాళీగా ఉన్న

వాళ్ళు వెళ్ళినా... వాళ్ళను ఆ పాప అడగలేదన్న విషయం తెలిసి... ఆశ్చర్యంగా కారణం ఏమిటని అడుగుతుంది. 'వాళ్లూ మా నాన్నలాగే తాగివుంటే...? ఆ భయంతోనే...' అని సమాధానం చెప్పింది.

ఆ చిన్నారి వయసు ఏడు సంవత్సరాలు మాత్రమే. ఆ వయసుకే అలాంటి ఆలోచన రావటం... తాగిన వాళ్ళప్రవర్తన గురించి భయం కలగటం... ఆ టీచరును ఆలోచనలో పడేశాయి. ఆ తర్వాత ఇంకొక అమ్మాయి దిగులుగా ఉండటాన్ని చూసి ప్రశ్నించినపుడూ అలాంటి జవాబే వచ్చింది. వాళ్ళ నాన్న తాగి వచ్చి రోజూ వాళ్ళమ్మతో గొడవపడి కొడతాడంది. వాళ్ళమ్మ దెబ్బలతో బాధపడటాన్ని చూడలేకపోతున్నానంటూ, పెద్దయ్యాక జడ్జి అయి... అలాంటి వాళ్ళందర్నీ శిక్షించాలని ఉందని చెప్పింది. పైగా తాగకపోతే, వాళ్ళ నాన్న చాలా మంచివాడనీ కితాబు ఇచ్చింది.

ఇలా చాలామంది పిల్లల తాగుబోతు తండ్రుల కష్టాలు విన్నాక ఏం చేయాలా అనే ఆలోచనతో ఆడవాళ్ళందర్నీ సమావేశపరిచి, వాళ్ళ సమస్యలు తెలుసుకుంది, ఆ టీచర్.

ఒక మహిళా కానిస్టేబుల్ సహకారం, సత్యసాయి ట్రస్టువారి సాయంతో డి. ఆడిక్షన్ సెంటర్, కౌన్సిలింగ్ క్యాంపు ఏర్పాటు చేసి... ఆడవాళ్ళందరికీ ఆర్థిక స్వతంత్రం ఉండేలా టైలరింగ్ నేర్పించే ప్రణాళిక సిద్ధం చేయగలుగుతుంది. ఈ పనులలో ఆ టీచరు స్నేహితురాలు, కొడుకు కూడా సహకరిస్తారు!

పాఠశాల వార్షికోత్సవంలో.... పిల్లలతో ప్రదర్శింపచేసిన కార్యక్రమాలను చూసిన పెద్దలంతా వాళ్ళ నైపుణ్యాలకు ముగ్ధులవుతారు... ఒక బాలిక తాతయ్య అయితే... రత్నంలాంటి పిల్లను తాగుడు అలవాటుతో నిర్లక్ష్యం చేస్తున్నందుకు కొడుకును కేకలు వేయటంతో... అతనూ ఆలోచనలో పడి... తాగుడుకు స్వస్తి చెప్పాలనే నిర్ణయానికి వస్తాడు.

పిల్లలు ఆనందంగా చదువుకునే వాతావరణానికి కుటుంబమూ ముఖ్య కారణం అవుతుంది. అందుకే... ఆ టీచరు పిల్లలకు చదువు చెప్పటమే తన బాధ్యత అనుకోకుండా, పిల్లల కుటుంబం బాగోగులూ ఆలోచించి... మద్యం అలవాటును దూరం చేయాలని శ్రమించి, ఫలితం సాధిస్తుంది. ఆమె పెద్దలకూ పాఠాలు చెప్పిన టీచరుగా గుర్తించి... ఆమె కథనాన్ని పేపరులో ప్రచురించారు. అది చదివాక... నాకూ ఆమె ప్రయత్నం చాలా గొప్పగా అనిపించింది! ఈ కథనాన్నే ఒక చిన్న నాటికలా రాయాలని ఉద్దేశ్యం... ఎలా ఉంది...?''

''చాలా బావుంది. వ్యసనాల్ని మానిపించే లక్ష్యంతో మీరు చేస్తున్న వీడియోలన్నీ ఒకే సబ్జెక్టుతో

ఉన్నా.... సన్నివేశాల కూర్పు... సంభాషణల ద్వారా హాస్యాన్ని గుమ్మరించటం.... వాటివలన... ఆదరణ పొందుతున్నాయని నా అభిప్రాయం! ఇంతకీ ఇందులో మీరు నాకు ఇచ్చే పాత్ర ఏమిటో....?''

శకుంతల ప్రశ్నకి అభిరామ్ చిరునవ్వుతో ''టీచరు... ప్రధాన పాత్రే నీది! పేరు కూడా మార్చకుండా ఆమె పేరే ఉంచేద్దామనుకుంటున్నా... మనోజ...!'' అన్నాడు.

శకుంతల మొహం ఆనందంతో వెలిగిపోయింది...! ''నిజంగానా... పేరు చాలా బావుంది! ఇకపై నా పేరు అందరూ శకుంతలని మర్చిపోయి.... 'మనోజ' అని గుర్తుపెట్టుకునేలా, ఆ పాత్రలో జీవించేస్తా... చూడండి...!'' అంటూ నవ్వింది.

''నువ్వలా చేయగలవులే, నాకు తెలుసు! నువ్వు... నా రాతలకి ఆదరణ వస్తోంది అంటున్నావుగానీ... అది పూర్తి నిజం కాదు... మీరందరి నటనవల్లే, ఆ వీడియోలు అన్నీ ఆదరణకు నోచుకుంటున్నాయని నా అభిప్రాయం...! పెద్దవాళ్ళ సంగతి ఏముందిగానీ, చిన్న పిల్లల నటన, సంభాషణలను పలికే తీరు చూస్తుంటే మాత్రం... చాలా ముచ్చటేస్తోంది...! అసలు నిజం చెప్పాలంటే... మందు అలవాటు మానేసిన వాళ్ళందరికీ పిల్లల మాటలే గుణపాఠాలయ్యాయి. భార్యాపిల్లల్ని నిరాదరణ చేసి, కుటుంబానికి దూరమైన మగవాడికి... అప్పుడు మాత్రమే వాళ్ళ విలువ తెలుస్తుందన్నది నిజం! మనసు పెట్టి ఆలోచించగలిగితే, పిల్లల మాటలు, ఆలోచనలు నుండి పెద్దలు ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకోగలుగుతారు...!''

అభిరామ్ మాటలకు శకుంతల తలవూపి ''మీరు చెప్పింది చాలా నిజమండీ! నా అనుభవం... ఒక చిన్న సంఘటన చెప్పనా... మీకూ మీ రచనలకు ఉపయోగపడుతుందేమో...'' అంది.

అభిరామ్ చెప్పమన్నట్లుగా చూడటంతో శకుంతల ఉత్సాహంగా మొదలుపెట్టింది.

''మొన్నీమధ్య నేను రెండు రోజులు సెలవు తీసుకుని మా బంధువుల ఇంటికి వెళ్ళానా... అపుడు మా వదినతో, వాళ్ళిద్దరి చిన్న పిల్లలతో పాటూ నేనూ మాల్‌కి వెళ్ళాను. అక్కడ ఏడెనిమిదేళ్ళ వయసున్న వాళ్ళ పెద్ద పాప ఏదో బొమ్మని చూపించి... కావాలని అడిగింది. వదినేమో 'పెద్దదానివైనా నీకు అన్నీ కావాలనిపిస్తుంది...' అంటూ విసుక్కుంది. తర్వాత ఒక క్షణానికే... మూడు నాలుగేళ్ళ చిన్నపిల్లకూడా అదే బొమ్మ కావాలనడిగింది. ఇక చేసేదేం లేక మా వదిన 'పెద్దది వూరుకోదుగా, దీనికీ ఎక్కించింది. కొనకపోతే, వూరంత నోరు పెట్టుకుని ఏడిచి పరువు తీసేస్తుంది...' అని విసుక్కుంటూనే కొని పిల్ల చేతిలో పెట్టింది. ఆశ్చర్యంగా, ఆ బొమ్మని ఆ పిల్ల అక్క చేతికి ఇస్తూ 'అక్కా... దీనిని నీ దగ్గిరే ఉంచు. మనం ఇద్దరం ఆడుకుందాం... నీకు నచ్చిందనే నేనూ కొనమని అడిగా... ఇది నీదే...' అంది ముద్దు మాటలతో.

వాళ్ళమ్మ పెద్ద పిల్లని చూస్తూ ''నువ్వెపుడూ దాని చేతిలో ఉన్నవి లాక్కోవటానికీ, ఏడిపించటానికే చూస్తావ్... చిన్న పిల్లయినా చూడు. ఎంత బాగా చెప్పిందో... బుద్ధి తెచ్చుకో...'' అంది కసురుకుంటున్నట్లుగా.

ఆ పెద్ద పిల్ల నదురూ బెదురూ లేకుండా వాళ్ళమ్మకేసి చూస్తూ సమాధానం ఏమని చెప్పిందో తెలుసాండీ...? 'అవునమ్మా... చెల్లి చాలా మంచిదని నాకూ ఇపుడే తెలిసింది. తనతో ఇక ఎపుడూ గొడవ పెట్టుకోను. ఇద్దరం చక్కగా ఆడుకుంటాం...!' అని చెబుతూనే నిరసనగా చూస్తూ 'నువ్వన్న మాటే నాకు నచ్చలేదు. ఆ బొమ్మ అనవసరమనో,

మనం కొనలేనంత ఖరీదయినదనో చెబితే నాకు కోపం వచ్చేది కాదు... పెద్దదానివైనా.. అన్నావు... అంటే... చెల్లెలు ఉంటే నేను చిన్న పిల్లని కాదా...? అపుడే పెద్దదాన్ని అయిపోయానా...?' అనడిగింది.

ఆ మాటలకు నిజంగా మా ఇద్దరికీ తలతిరిగింది...! ఏం చెప్పాలో కూడా మా వదినకు తోచలేదు కాబోలు... తేరుకోలేనంత విస్మయంలో కూరుకుపోయినదానిలా ఒక క్షణం అలాగే నిలబడిపోయింది! తరువాత తేరుకుని.... పెద్ద పిల్లని రెండు చేతులతో దగ్గరకు తీసుకుంది. 'సారీ... తల్లీ...' అంటూ గొణిగింది మెల్లగా. 'మీ ఇద్దరూ చక్కగా స్నేహంగా ఆడుకోవటమే నాక్కావలసింది.... ఇలాగే మీరు గొడవలు పెట్టుకోకుండా ప్రేమగా ఉండాలి' అంది అనునయంగా. ఏడేళ్ళ అమ్మాయి గురించి మీరు చెప్పినపుడు... నాకూ ఆ పాప మాటలు గుర్తుకొచ్చి మీకు చెప్పాలనిపించింది!''

శకుంతల మాటలకు అభిరామ్ కూడా చిరునవ్వుతో ''నిజం కుంతలా... పిల్లల్లో... చాలా తెలివైన మెరికల్లాంటివాళ్ళు ఉంటారు. కొన్నిసార్లు పెద్దవాళ్ళే వాళ్ళ ఆలోచనల స్థాయిని అందుకోలేరు కూడా!'' అంటూ ఇంకొక మాటా అన్నాడు ''పిల్లలతో బంధాలూ, అనుబంధాల వలనే మనలో చాలా కుటుంబాలు విడిపోకుండా స్థిరంగా నిలబడి వున్నాయనే పెద్దల మాటా నిజమేననిపిస్తుంది...!''

'కుంతలా' అని ఉద్దేశపూర్వకంగానో, అప్రయత్నంగా అన్నాడో తెలియదు గానీ... శకుంతలకి అభిరామ్ తనని అలా పిలవటం మాత్రం చాలా ఆనందాన్ని కలిగించింది! అది చిరునవ్వులా మోహమంతా పరుచుకుంది కూడా!

వెన్నెల వెలుగుతో వెలిగిపోతున్న మోమును కొంచెంగా దించుకుని... అనురాగం నిండిన స్వరంతో ''మిమ్మల్ని ఓ మాట అడగవచ్చునా...?'' అంది శకుంతల.

''అదేమిటీ... అనుమతి అడగాలా నన్ను...? ఏమాట అయినా అడగగలిగే చనువుందిగా...!'' అన్నాడు అభిరామ్ ఆమె వైపు కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ.

''నిజమే... కానీ మీ స్వవిషయం... అందుకని కొంచెం సంశయంగా అనిపించీ...'' అంటూ మాటలు ఆపేసిన శకుంతల వైపు చిరునవ్వుతో చూసి ''ఏదైనా ఫరవాలేదు. అడగొచ్చు...!'' అన్నాడు అభిరామ్.

''ఏం లేదూ... మీరు కుటుంబం ప్రాధాన్యత గురించి చెబుతూంటారుగా మరి... మీరు... మాత్రం అలా ఆలోచించటం లేదెందుకనీ...?''

ఏకబిగిన ప్రశ్నవేసి 'హమ్మయ్య' అనుకుంది శకుంతల మనసులో.

''అంటే...?'' అంటూ శకుంతల వైపు ప్రశ్నార్థకంగా చూశాడతను.

శకుంతలకి మళ్ళీ సంశయం కలిగింది. తన ప్రశ్న నిజంగా అర్థం కాకనేనా... లేక వేరే ఉద్దేశ్యం ఏదైనా ఉందా...?!

‘‘మీ విషయాలు కొన్ని తెలుసు... అదే మీరు... విడాకులు తీసుకున్నారని... ఒంటరిగా ఎందుకు ఉండిపోవటం అనేది నా ప్రశ్న...’’ అంది శకుంతల.

శకుంతలకు అభిరామ్ పట్ల అపారమైన ఇష్టం, ఆకర్షణా ఉన్నాయి. వీడియోలు తీసేటపుడు తన పట్ల అభిరామ్ ఎంతో అభిమానం చూపించటం శకుంతల గమనించింది. తన పట్ల ఉన్న ఇష్టాన్ని తెలియజేయటానికి తను వయసులో చిన్నదని ఆలోచిస్తున్నాడేమోననే అనుమానం మనసులో

ఉంది. అందుకే... ఆ అనుమాన నివృత్తికోసం... తన పట్ల ఉన్న ఇష్టాన్ని స్పష్టంగా తెలుసుకోవటానికీ తనే ముందంజ వేయాలనే ఆలోచన ఆమెకు ఉంది. చనువుగా మాట్లాడుతోన్న ఆ సమయాన్ని అందుకు వినియోగించుకోవాలనిపించి... ముందుగా అతని ఆలోచన తెలుసుకోవటానికి ఆ ప్రస్తావన తీసుకువచ్చింది.

అతను ఏం చెప్పాలో తోచనట్లుగా మౌనం వహించేసరికి శకుంతల మళ్ళీ ముందడగు వేస్తూ ‘‘మీరు... మందు అలవాటుకు ఉద్వాసన చెప్పగలగటమేకాదు... గంజాయి, డ్రగ్స్, మందు లాంటి వ్యసనాల బారిన బడిన వాళ్ళని... మామూలుగా చేయటానికీ, పిల్లలు అటువేపు అడుగులు వేయకుండా ఉండటానికి... మీ రచనాశక్తినీ, సమయాన్నీ సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. ఇక కొద్దిరోజుల్లోనే ఇక్కడనుండి వెళ్ళిపోవటమూ జరుగుతుంది కదా...!’’

‘‘మరి... మరి... ఎవరైనా మిమ్మల్ని ఇష్టపడి... జీవితాంతం మీకు తోడుగా నిలబడటానికి ముందుకు వస్తే... మీకు... అభ్యంతరం ఏమీ ఉండదు కదా...?’’

పరోక్షంగా తన మనసు తెలియజేసే ప్రయత్నం చేసింది శకుంతల.